# ‘సామ్రాజ్యవాదం నశిస్తుంది. ఎన్ని అవాంతరాలున్నా ప్రపంచ సోషలిస్టు విప్లవం విజయం సాధిస్తుంది’ కా॥ లెనిన్

**నవంబరు 6, 1918న విప్లవ వార్షికోత్సవ సందర్భంగా యేర్పాటయిన కార్మికుల, రైతుల, కోసక్‌ల, ఎర్రసైన్య అధికారుల సోవియట్ల అసాధారణ ఆరవ అఖిల రష్యా మహాసభలో కా॥ లెనిన్ యిచ్చిన ఉపన్యాసం**



*యావత్ భూమండలాన్నీ ఒక్క కుదుపుకు గురిచేసిన చారిత్రాత్మక అక్టోబర్ మహావిప్లవపు శతవార్షిక సందర్భమిది. 1917 అక్టోబర్ విప్లవంగా ప్రసిద్ధికెక్కిన ఈ విప్లవంతో బూర్జువా, భూస్వామ్య పీడకవర్గాలను కూలద్రోసి తొట్టతొలిసారిగా శ్రామికవర్గ ప్రజానీకం రాజ్యాధికారాన్ని కైవసం చేసుకుని, సామ్యవాద వ్యవస్థను నెలకొల్పిన మహత్తర సంఘటన ఇది. ఆంతరంగికంగానూ, బాహ్యంగానూ చుట్టుముట్టిన శత్రువులను, దోపిడీవర్గపు ఏజెంట్లను ఓడిస్తూ, పార్టీలో ఆంతరంగికంగా తలెత్తిన అనేక తప్పుడు సిద్ధాంత వైఖరులను పూర్వపక్షంగావిస్తూ, కార్మికవర్గపు, ప్రజానీకపు రాజకీయ చైతన్య స్థాయిని సిద్ధాంత, ఆచరణరంగాల్లో పరిపుష్టం చేస్తూ బోల్షివిక్ కమ్యూనిస్టుపార్టీ, దాని అత్యున్నత నాయకుడైన కా॥ లెనిన్ ఆధ్వర్యంలో సామ్యవాద విప్లవాన్ని సాకారం చేసిన అద్భుత సమయమిది. అక్టోబర్ మహా విప్లవ శత వార్షికోత్సవం సందర్భంగా యావత్ శ్రామికలోకానికి జేజేలర్పిస్తూ, మనదేశ శ్రామిక ప్రజానీకం తమ ముందున్న కర్తవ్యాలకు మరింతగా అంకితం కావాలి.*

*అక్టోబర్ విప్లవ మొదటి వార్షికోత్సవం సందర్భంగా 1918 సం॥లో కా॥ లెనిన్ చేసిన ఉపన్యాసమిది. అప్పటికి గడిచిన ఒక సంవత్సర పరిస్థితిని సింహావలోకనం చేస్తూ, కార్మిక-కర్షక ఐక్యతావశ్యతను నొక్కి చెపుతూ, నాటికే రష్యాను చుట్టుముట్టిన విపత్కర పరిస్థితులన్నింటినీ, ప్రజల ముందున్న కర్తవ్యాలనూ సూటిగా, స్పష్టంగా ఈ ఉపన్యాసంలో ఆయన పేర్కొన్నారు.* **– సంపాదకుడు**

**(సభలోకి** కామ్రేడ్ లెనిన్ రాకకి దీర్ఘకరతాళ ధ్వనులతో స్వాగతం) కామ్రేడ్స్, అంతర్జాతీయ శ్రామికవర్గ ఉద్యమంలో అత్యంత ప్రాముఖ్యమైన సంఘటనలు జరిగే కాలంలో మనం విప్లవ వార్షికోత్సవాన్ని జరుపుకొంటున్నాం. పాత ప్రభుత్వమూ గతంలో పాలించిన బూర్జువావర్గాల ఒత్తిడితోనూ, ఒప్పందాలతోనూ ప్రపంచయుద్ధం అంతమవదని శ్రామిక వర్గంలోనూ, సామాన్యంగా శ్రామిక జనంలో వున్న మహా సంశయాత్ములకీ, శంకితులకీ కూడా తేటతెల్లమయింది. ఈ యుద్ధం రష్యాతో పాటుగా ప్రపంచాన్నంతటినీ శ్రామిక విప్లవం వైపుకి, పెట్టుబడిదారులమీద శ్రామికుల విజయంవైపుకి నడిపిస్తోందని స్పష్టమయింది. పెట్టుబడిదారీ విధానం ప్రపంచాన్ని రక్తంలో ముంచెత్తింది. ఆస్ట్రియాలో జర్మనీల సాయంతో ఆంగ్లో – ఫ్రెంచ్ సామ్రాజ్యవాదం, జర్మన్ సామ్రాజ్యవాదం చేసిన బీభత్సాలు, హింసల తరువాత కూడా పెట్టుబడిదారీ విధానం అదే సిద్ధాంతాన్ని పాటిస్తోంది.

ఈ రోజున, మనం విప్లవ వార్షికోత్సవం జరుపుకునే ఈ రోజున, విప్లవం నడచి వచ్చిన బాటకేసి ఒకసారి తిరిగి చూసుకోవడం సమంజసంగా వుంటుంది. ప్రపంచంలోని ఏ శ్రామిక విప్లవమూ యెన్నడూ ఎదుర్కోవలసి రాని అసాధారణ కష్ట పరిస్థితుల్లో మనం విప్లవం ఆరంభించాం. అంచేత మనం దాటిన దారిని చూసి ఈ సింహావలోకనం చేసుకోవడం, మరీ ముఖ్యం. ఈ కాలంలో సాధించినవి గడిచిన ఈ సంవత్సరంలోనూ ఎంతమేరకి మన ప్రధానమైన, నిజమైన, నిర్ణాయకమైన ప్రాథమికమైన కర్తవ్యానికి మనం సన్నద్ధులమయ్యాము అన్నది సింహావలోకనం చేసుకోవాలి. ప్రపంచ శ్రామిక సామ్యవాద సైన్యంలో ఒక భాగంగా, ఒక పటాలంగా మనం వుండాలి. ప్రపంచవ్యాప్త పోరాటంలోనుంచి రూపు తీసుకొని పెరిగిన ఈ విప్లవాన్ని , మిగతావాళ్ళ కంటె అభివృద్ధి చెందామనో, లేకపోతే రష్యన్ శ్రామికులకి ప్రత్యేక ప్రతిభలేవో వున్నాయనో మనం ప్రారంభించలేదు. ఈ విషయం మనం ఎప్పుడూ గుర్తిస్తూనే వున్నాం. ఆ మాటకొస్తే పెట్టుబడిదారీ విధానపు వెనుకబాటుతనమూ, ప్రత్యేక బలహీనతలవల్లనే, సైనిక వ్యూహ పరిస్థితులలోని ప్రత్యేకమైన వత్తిడుల వల్లనే, మనం మిగిలిన శ్రామిక పటాలాల కంటే, ఆ సంఘటనలతోపాటుగా ముందుకు సాగాం. పెట్టుబడిదారులు మనల్ని పట్టుకొని తిరుగుబాటు చేసేదాకా ఆగకుండా నడవడంవల్లనే, అది సాధ్య మయింది. ఇప్పుడు ఈ సింహావలోకనం చేసుకుంటున్నా మంటే రాబోయే విప్లవాల్లో మనం ఎదుర్కోవాల్సిన యుద్ధాలకి సన్నాహాలు ఎలా వున్నాయి అని బేరీజు వేసుకోవడం కోసమే.

అంచేత కామ్రేడ్స్, గత ఏడాదిలో మనం ఏ ఘనమైన మార్పులు సాధించామని ప్రశ్నించుకుంటే ఇలా చెప్పవచ్చు: శ్రామికవర్గ ప్రథమ యత్నం శ్రామికుల అజమాయిషీ నుంచి, దేశ వనరులని వ్యయం చెయ్యడం నుంచి, పరిశ్రమల్లో శ్రామికుల నిర్వహణ సృష్టించే ద్వారం దగ్గర ఈనాడు మనం వున్నాం. భూమికోసం సామాన్య రైతాంగ పోరాటంనుంచి, భూస్వాములకి వ్యతిరేకంగా రైతుపోరాటం నుంచి, జాతీయబూర్జువా ప్రజాస్వామిక స్వభావంకలిగి వుంటుంది అది. మనం ఈనాడు శ్రామిక, అర్ధశ్రామిక అంశాలు విడివడ్డ దశకి చేరాం. శ్రమిస్తూ దోచుకోబడే వాళ్ళు మిగిలిన వాళ్ళ నుంచి విడిపోయి కొత్తజీవితం ఆరంభిస్తున్నారు. ఘోరంగా అణగద్రొక్కబడ్డ గ్రామీణ జనం, గ్రామీణ కులక్, బూర్జువాలతో సహా బూర్జువాలకి వ్యతిరేకంగా, కడకంటా పోరాడుతున్నారు.

ఇంకా, సోవియట్ వ్యవస్థ ఆరంభ దశనుంచి ఇప్పుడు మనం ఇంకో దశకి చేరాం. కామ్రేడ్ స్వెర్డ్లోవ్ ఈ మహాసభ ప్రారంభంలో సరిగా చెప్పినట్లు సోవియట్ అధికారం చెలామణి కాని భాగం ఎంత మారుమూల దయినా రష్యాలో లేదు; సోవియట్ రాజ్యాంగంలో మిళితమైపోకుండానూ లేదు; శ్రామిక పీడిత జనం పోరాటంలో సాధించిన దీర్ఘ అనుభవం పునాదిగా వుంది ఈ రాజ్యాంగం.

నాలుగేళ్ళ యుద్ధం తర్వాత ఏ రక్షణాలేని దాని బదులు మనకి ఇప్పుడు ఒక శక్తివంతమైన ఎర్రసైన్యం వుంది. ఆ యుద్ధం పీడిత ప్రజాసమూహంలో అసహ్యాన్ని, విద్వేషాన్ని రేకెత్తించింది. వాళ్ళని ఘోరమైన నిస్తేజంలోనూ, నిస్సత్తువలోనూ పారేసింది. జర్మన్, ఆసియన్ సామ్రాజ్యవాదుల తాడనం మనం కాచుకోలేని దశలో వున్నప్పుడు, విప్లవాన్ని కష్టతరమమైన తీవ్రమైన రోజులపాలపడేసింది. ఆఖరిగా, అన్నిటికంటే ముఖ్యంగా, మనం అంతర్జాతీయంగా వేర్పాటు నుంచి బయటపడ్డాము. అక్టోబర్లోనూ, ఈ సంవత్సరం ఆరంభంలోనూ, మనం అనుభవించిన ఈ వేర్పాటు నుంచి మనకున్న ఒకేఒక, అయినా దృఢమైన, మిత్రవర్గం ప్రపంచ శ్రామిక పీడిత జనం, చివరికి తిరుగుబాటు చేసే దశకి చేరాం. పశ్చిమయూరప్ శ్రామికవర్గ నాయకులు లీబ్‌నెక్ట్, ఆడ్లర్‌లాంటి వాళ్ళు సామ్రాజ్యవాద యుద్ధవ్యతిరేకతని సాధించడం కోసం తమ వీరోచిత సాహస ప్రయత్నంలో, నెలల తరబడి చెరసాలలో మ్రగ్గిన వాళ్ళు వియన్నాలోనూ, బెర్లిన్‌లోనూ త్వరితంగా పెరుగుతూవున్న శ్రామిక విప్లవాల వత్తిడిలో విడుదల చేయబడే దశకి చేరాం. వేర్పాటు అవడానికి బదులుగా మనం మన అంతర్జాతీయ మిత్రవర్గంతో భుజం భుజం కలిపి నడిచే దశకి చేరాం. అవీ ఈ గడిచిన సంవత్సరంలో మనం సాధించిన విజయాలు. మనం నడిచివచ్చిన బాటగురించి, ఈ సంధికాలం గురించి కొన్ని మాటలు చెప్పాలని అనుకుంటున్నాను.

మొదట్లో మన నినాదం శ్రామికుల అజమాయిషీ అని కెరన్‌స్కీ ప్రభుత్వం ఎన్ని వాగ్దానాలు చేసినా పెట్టుబడిదారులు ఉత్పత్తిని విచ్ఛిన్నం చేస్తున్నారని, అస్తవ్యస్తస్థితిని పెంచుతున్నారని మనం అన్నాం. ఇది పూర్తిగా కూలిపోయి వుండేదని ఇప్పుడు మనం చూడగలం. అంచేత ఏ సామ్యవాద శ్రామిక ప్రభుత్వమైనా తీసుకొనే ప్రధానమైన చర్య శ్రామికవర్గ అజమాయిషీ. మనం పరిశ్రమలన్నింటా సోషలిజాన్ని ఆజ్ఞాపించలేదు. ఎందుకంటే సోషలిజం రూపు తీసుకోగలిగేది, పటుతరమయ్యేది శ్రామికవర్గం ఆర్థిక వ్యవస్థని నడపగలిగినప్పుడే కాబట్టి; శ్రామికవర్గం అధికారం పట్టుగా ఏర్పడి స్థాపించబడినప్పుడే కాబట్టి. అది లేకుండా సోషలిజం అనేది ఒట్టి కల మాత్రమే. అందుకనే మనం శ్రామికుల అజమాయిషీని-అది వైరుధ్య పూరితమైన, అసంపూర్తి చర్యఅని గుర్తిస్తూనే-ప్రవేశ పెట్టాం. కాని శ్రామికులు తమంత తామే, ఇంత విశాల దేశంలో, దోపిడీదారులు లేకుండా, వాళ్ళకి వ్యతిరేకంగా పరిశ్రమల్ని నిర్మించి, ఆ చారిత్రాత్మకమైన కర్తవ్యాన్ని నిర్వహించడానికి ఇది ముఖ్యం.

ప్రత్యక్షంగాకాని, పరోక్షంగాగాని ఇందులో పాల్గొన్న ప్రతివాడూ; బూర్జువా పాలన తాలూకు క్రూరత్వాన్నీ పీడననీ అనుభవించిన ప్రతివాడూ, చాలా నేర్చుకున్నాడు. కొంచెమే సాధించామని మనకి తెలుసు. ఎంతో వెనుకబడివున్న, దారిద్ర్యంలో వున్న ఈ దేశంలో; శ్రామికుల దారిలో ఎన్నో ఆటంకాలు, అవరోధాలు వున్న ఈ దేశంలో, పరిశ్రమల్ని నడపడం గురించి తెలుసుకోవాలంటే వాళ్ళకి చాలాకాలం పడుతుందని మనకు తెలుసు. కాని శ్రామికులే తమ విధిని నిర్వహించడాన్ని మనం చాలా విలువయిందిగా, ముఖ్యమయిందిగా గుర్తిస్తాము. శ్రామికుల అజమాయిషీ దశనుంచి, అలాంటివి పరిశ్రమ ముఖ్యరంగాల్లో గందర గోళంగా, నిర్మాణరహితంగా, ఆదిమంగా, అసంపూర్తిగా వుండి తీరినా, జాతీయస్థాయిలో శ్రామికులు పరిశ్రమను నిర్వహించే స్థాయికి చేరాము.

కార్మిక సంఘాల పరిస్థితి మారింది. ఇప్పుడు వాళ్ళ ముఖ్యమైన పని యాజమాన్య విభాగానికి, కేంద్ర విభాగాలకి ప్రతినిధులను పంపడం. ఉద్దేశ్యపూర్వకంగా ఛిన్నాభిన్నం చేయబడి, నాశనం చేయబడిన పరిశ్రమ రంగాన్ని ఆ నిర్మాణాలు తీసుకున్నాయి. వాటికీ, కొత్త నిర్మాణాలకీ ప్రతినిధులను పంపడమే వాళ్ళ ముఖ్యమైన పని. పెట్టుబడిదారీ విధానంలో ఆదినుంచి తమ చదువుని, తెలివిని – అవి మానవాళి జ్ఞాన భాండార ఫలితాలయినా–ఉద్దేశపూర్వకంగా సామ్యవాద లక్ష్యాన్ని భగ్నం చేయడానికే (పీడకులులేని సాంఘిక యాజమాన్య ఆర్థికవ్యవస్థ నిర్మించే దానికి బదులుగా) ఉపయోగించిన మేధావుల సహాయం లేకుండానే శ్రామికులు పరిశ్రమల్లో నెగ్గుకు రాగలిగారు. పరిపాలనా కర్తవ్యం నిర్వహించడంలో ఏమాత్రం శిక్షణలేని శ్రామికులను అడ్డం కొట్టడానికీ, ఆటంక పరచడానికీ ఈ మేధావులు తమ జ్ఞానాన్ని ఉపయోగించారు.

ప్రధానమైన ఆటంకం తొలగించబడినట్లు మనం చూడగలం. అది చాలా కష్టభూయిష్టమైంది. కాని, బూర్జువాలవైపు ప్రజలు మొగ్గే నష్టం ఆపబడింది. ఇన్ని అడ్డంకులున్నా శ్రామికులు సామ్యవాద పునాది వెయ్యడంలో కృతకృత్యులయ్యారు. మనం అతిశయోక్తులూ చెప్పటం లేదు; నిజం చెప్పడానికి భయపడటమూ లేదు. అంతిమ లక్ష్య ప్రమాణాలతో చూస్తే మనం చాలా తక్కువ సాధించమన్నది నిజం. కాని ఈ పునాదిని సుస్థిరం చేయడానికి చాలా చాలా ఎక్కువ చేశాము. సామ్యవాదం గురించి చెప్పేటప్పుడు పుస్తకాలు, కరపత్రాలు చదివి అదే అర్థంలోనే రాజకీయ చైతన్యం సంతరించుకొని శ్రామికులు ఈ సామ్యవాద పునాదులు వేశారని చెప్పలేం. రాజకీయ చైతన్యం అంటే మన అర్థం – వాళ్లు ఈ భయంకర కర్తవ్యాన్ని తమ స్వంత ప్రయత్నాలతో, తమ స్వంత హస్తాలతో సాధించారనే. వాళ్లు వందలాది ఘోరాలు చేశారు. ప్రతి ఒక్కదాన్నుంచి వాళ్ళే బాధపడ్డారు. కాని ప్రతీది వాళ్ళకి పారిశ్రామిక నిర్వహణలో తర్ఫీదు ఇచ్చి, పటిష్టం చేసింది. పారిశ్రామిక నిర్వహణ ఇప్పుడు పటువయిన పునాదిమీద స్థాపించ బడింది. వాళ్ళు తమ పనిని చూశారు. ఇప్పటినుంచి అది భిన్నంగా వుంటుంది. ఎందుకంటే అందరు శ్రామికులు ఏదో అభివృద్ధిచెందిన వాళ్ళూ,

నాయకులూ, మాత్రం కారు. శ్రామికుల్లో ఎక్కువభాగం తమంత తామే తమ చేతులతోటే సామ్యవాదాన్ని నిర్మిస్తున్నామని తెలుసుకున్నారు. దానికి ఇప్పటికే పునాది వేసుకున్నామనీ, దేశంలోని ఏ శక్తీ తమ పని కాకుండా నిరోధించలేదనీ తెలుసుకున్నారు.

పరిశ్రమల్లో మనకి ఎన్నో కష్టాలు వచ్చి వుండవచ్చు. ఆ పథంలో ఎంతో దూరం. నడవాల్సి వచ్చింది; కాని శ్రామికుల అజమాయిషీనుంచి శ్రామికుల నిర్వహణకి నడిపించడంలో వాస్తవంగా తక్కువే ఆ దూరం. వెనుకబడ్డ పల్లె ప్రాంతాల్లో మరింతగా సన్నాహాలు చెయ్యాల్సి వచ్చింది. గ్రామీణ జీవితంతో పరిచయం చేసుకొని, రైతు జీవితాన్ని అధ్యయనం చేసిన ఎవరైనా పట్టణ అక్టోబరు విప్లవం 1918 వేసవిలోనూ, ఆకురాలు కాలంలోనూ, మాత్రమే నిజమయిన గ్రామీణ అక్టోబరు విప్లవంగా అయిందని అంటారు. పెట్రోగ్రాడ్ శ్రామికులు, పెట్రోగ్రాడ్‌లో వున్న సైనికులు, అధికారం అందుకున్నప్పుడే పల్లెప్రాంత నిర్మాణ కార్యక్రమంలో తలయెత్తే మహా కష్టాలను గుర్తించారు. అక్కడ మన అభివృద్ధి క్రమంగా జరగాలని గుర్తించారు. సోషలిస్టు వ్యవసాయక పద్ధతిని శాసనంద్వారా అమలు పెట్టడం ఘోరమయిన తప్పిదమని గుర్తించారు. ఎందుకంటే అధిక సంఖ్యాకులకి అలాంటి లక్ష్యమేమి లేకపోవడంవల్ల, కొద్దిమంది తెలివయిన రైతులు మాత్రమే మన అండన వుండవచ్చు. అంచేత విప్లవ పురోభివృద్ధిలో మరీ ముఖ్యమైన వాటికే మనం పరిమితమయ్యాం – ఎట్టి పరిస్థితులలోనూ ప్రజాభివృద్ధిస్థాయిని దాటిపోయేందుకు ప్రయత్నించకుండా. కాని వాళ్ళ స్వంత అనుభవాలద్వారా, పోరాటాల ఫలితంగా, ఏర్పడే ఉద్యమ పురోగతికి నిరీక్షిస్తూ, రైతుల పురాతన శత్రువు అయిన భూస్వామిని, పెద్దకమతాల స్వంతదారుని, ఒక్క దెబ్బతో తుడిచిపెట్టేసే మేరకే మనం అక్టోబరులో పరిమితమయ్యాం. రైతులు అందరూ కలిసివచ్చిన పోరాటమిది. ఈ దశలో ఇంకా రైతులు శ్రామికులకింద, అర్ధశ్రామికుల కింద, బీదరైతులకింద, బూర్జువాలకింద విభజన అవలేదు. అలాంటి పోరాటం లేకుండా సోషలిజమే లేదని సోషలిస్టులమయిన మనకి తెలుసు. కానీ అలా తెలుసు కోవడం ఒక్కటే చాలదనీ గుర్తించాం. దాన్ని లక్షలాది ప్రజలకి, ప్రచారంద్వారాకాక, వాళ్ళ అనుభవంద్వారానే అవగతం చెయ్యాలి. ఆ కారణంవల్ల మొత్తం రైతులు సమానమైన భూకమతాల ఆధారంగానే విప్లవాన్ని ఊహించగలరు కాబట్టి, 1917 అక్టోబరు 26 నాటి మన ఫర్మానాలో “భూమిమీద రైతాంగ మాండేట్” నే మనం ఆరంభ దశగా గ్రహిస్తామని బహిరంగంగా ప్రకటించాం.

అది మన అభిప్రాయాలతో విభేదిస్తుందనీ, అది కమ్యూనిజం కాదని, మనం నిష్కర్షగానే చెప్పాం. కాని మన కార్యక్రమంతో సరితూగుతున్నంత మాత్రాన, వాళ్ళ అభిప్రాయాలతో సరితూగని దాన్ని రైతాంగంమీద మనం రుద్దలేదు. తోటి శ్రామికులతో మాదిరి రైతులతో సమంగా నడుస్తున్నామని; విప్లవాభివృద్ధి, మనకి ఏర్పడిన అభిప్రాయాలనే వాళ్ళకీ కలిగిస్తుందనే, విశ్వాసంతో వున్నామని మనం చెప్పాము. ఈ సిద్ధాంత ఫలితమే రైతు ఉద్యమం, వ్యవసాయిక సంస్కరణలు భూమిని సమాజపరం చెయ్యడంతో ఆరంభమయ్యాయి. ఆ పనిని యెన్నుకొని నిర్వహించాం. అది మన అభిప్రాయాలతో విభేదిస్తోందని బహిరంగంగా మనం చెప్పినా, సమాన భూకమతం అత్యధికుల ఆమోదాన్ని పొందింది. మనకి వాళ్ళ నెత్తిమీద దేనినీ రుద్దే తలపు లేదు. రైతులే ఆ అభిప్రాయాన్ని పూర్తిగా వదులుకుని ముందుకు సాగేదాకా ఆగడానికి మనం సిద్ధపడ్డాం. అంచేత మనం ఆగాం. మన శక్తుల్ని స్థిరం చేసుకోగలిగాం.

మనం అమలుచేసింది సాధారణ ప్రజాస్వామిక సూత్రాలమీదా; ధనిక, కులక్ రైతుని పేదరైతుతో కలిపే–భూస్వామి అంటే ద్వేషంమీదా ఆధారపడ్డ చట్టం. ఆ చట్టం సాధారణంగా సమానత్వం అన్న భావంమీద ఆధారపడింది. పాత ఏకచ్ఛత్రాధిపత్య వ్యవస్థకి వ్యతిరేకంగా నిర్దేశించిన, నిస్సందేహమైన విప్లవభావం అది. ఈ శాసనంనుంచి రైతుల విభజనకి మనం సాగాల్సి వచ్చింది. భూమిని సమాజపరంచేసే శాసనం సర్వత్రా ఆమోదించబడింది. మనమూ, బోల్షివిక్ సిద్ధాంతాన్ని అంగీకరించనివాళ్ళూ కూడా, ఏకగ్రీవంగా ఆమోదించాం. ఎవరు భూమిమీద హక్కు కలిగివుండాలి అనే దాన్ని నిర్ణయించడంలో వ్యవసాయిక కమ్యూన్లకి పైచేయి యిచ్చాం. అక్టోబరు 1917 నాటికి వ్యవసాయ రంగం సిద్ధంగాలేదని క్షుణ్ణంగా తెలిసీ మనం, సోషలిస్టు మార్గంలో అభివృద్ధికి దారి తెరచి వుంచాం. మన సన్నాహక చర్యలు, ఇప్పుడు మనం తీసుకుంటున్న బృహత్తర చారిత్రాత్మక ఆచరణకి, దారిని శుభ్రం చేశాయి. ఇలాంటి ఆచరణకి ఏ దేశమూ, ఏ అత్యంత ప్రజాస్వామిక ప్రభుత్వమూకూడా, పూనుకోలేదు. ఆ పనిని అందరు రైతులూ, రష్యాలోని సుదూర గ్రామాల్లోని రైతులు కూడా, ఈ వేసవిలో చేపట్టారు. ఆహార సమస్యలు తలెత్తి కరువు భయపెట్టినప్పుడు, గతం తాలూకు అవశేషాలూ, నాలుగేళ్ళ శనిగొట్టు యుద్ధం తరువాతి దుర్దశా అనుభవం అవుతూవున్నప్పుడు, ప్రతీఘాత విప్లవం అంతర్యుద్ధం, సుసంపన్నమయిన ధాన్య ప్రాంతాన్ని కాజేసినపుడు, ఇది అంతా తీవ్రస్థాయికి చేరుకున్నప్పుడు, పట్టణాలు కరువుతో భయపడినపుడు, ప్రభుత్వానికి వున్న ఒక్క విశ్వసనీయమైన దృఢమైన కవచం, శ్రామికులు, పట్టణాలలోని పారిశ్రామిక ప్రాంతాల్లోని శ్రామికులు, మొత్తంగా గ్రామీణ ప్రాంతాలకి వెళ్ళిపోయారు. శ్రామికులకీ, కర్షకులకీ మధ్య ఆయుధ సంఘర్షణని రెచ్చగొట్టడానికే వాళ్ళు అక్కడకి వెళ్ళారనడం నిందమాత్రమే. జరిగిన సంఘటనలు ఆ నిందని బట్టబయలు చేశాయి. ప్రజలు తిండిలేక మాడే సమయంలో, ధాన్య లాభాలతోటి సంపద నింపుకుంటున్న కులక్‌లనీ, దోపిడీదారులనీ, అణచడానికే వాళ్ళు వెళ్ళారు. వాళ్ళు గ్రామ జనాభాలో అధిక సంఖ్యాకులైన పేద రైతులకు సాయపడ్డానికే వెళ్ళారు. కులక్ తిరుగుబాట్లు మొత్తం రష్యాని ముంచెత్తిన జులై సంక్షోభం, వాళ్ళ యాత్ర వృథా పోలేదని స్పష్టం చేసింది; వాళ్ళు స్నేహహస్తాన్ని చాచారని, వాళ్ళ సన్నాహకచర్య రైతాంగపు ప్రయత్నాలతో మిళితమయిందని స్పష్టంచేసింది. శ్రామిక పీడిత గ్రామీణ ప్రజానీకం ప్రతిచోటా మేల్కొని, పట్టణ శ్రామికులతో కలసి, జులై సంక్షోభాన్ని పరిష్కరించుకొన్నారు. ఈవేళ 18వేల మంది ప్రజలు పెట్రోగ్రాడ్‌లో పేదరైతు సమితి ప్రాంతీయ మహాసభకి హాజరవుతున్నారనీ, వాళ్ళల్లో అద్భుతమయిన ఉత్సాహమూ హుషారూ వున్నాయని కామ్రేడ్ జినోవీవ్ నాకు టెలిఫోన్‌లో చెప్పారు.

రష్యా అంతటా జరుగుతున్న సంఘటనలు విస్పష్టమవుతూవుంటే, కులక్‌లతో పోరాటమంటే ఏమిటో, తాము రంగంలోకి దిగినపుడు తమ అనుభవాలనుంచే గ్రామీణ పేదలు గుర్తించారు; పట్టణాలకి తిండి సరఫరాచేసి, వస్తుమార్పిడిని–అది లేకపోతే పల్లెల్లో గడవదు–తిరిగి స్థాపించుకొనేందుకు బూర్జువాలతోటి, కులక్‌లతోటి సంబంధాలు తెంచుకోవాలనీ గుర్తించారు; వాళ్ళు విడిగా నిర్మాణం అవ్వాలి. ఇప్పుడు మనం గ్రామీణ ప్రాంతాల్లో మొట్టమొదటి చారిత్రాత్మక, సామ్యవాద విప్లవ ఆచరణ మొదలెట్టాం. ఆ చర్యని అక్టోబరులో తీసుకోగలిగి వుండేవాళ్ళం కాదు. ప్రజలదగ్గరకి ఎప్పుడు వెళ్ళగలిగేది మనం అంచనా వేశాం. గ్రామీణ ప్రాంతాల్లో సామ్యవాద విప్లవం ఆరంభమయిన దశకి మనం చేరాం. ప్రతీ గ్రామంలోనూ, మారుమూల పల్లెల్లో కూడా తమ పొరుగునున్న ధనిక కులక్ ధాన్య లాభాల్లో వుంటే రైతు గ్రహిస్తాడు. ప్రతి విషయాన్ని తన పాత ముతక మనస్తత్వపు దృష్టితోనే చూస్తాడు.

అంచేత పల్లె ప్రాంతాల్లో గ్రామీణ పేదలు తమ నాయకులయిన పట్టణ శ్రామికులతోకలిసి, ఇప్పుడు సోషలిస్టు నిర్మాణానికి దృఢమైన, పటువైన పునాది ఏర్పాటుచేస్తున్నారు. ఇప్పుడు సోషలిస్టు నిర్మాణం పల్లెల్లో మొదలవుతుంది. ఇప్పుడే సోవియట్ల క్షేత్రాలు, ఒక పద్ధతి ప్రకారం, విస్తారమయిన సామాజికపరం కాగల క్షేత్రాలుగా రూపు తీసుకుంటున్నాయి. విజ్ఞానాన్ని, శాస్త్రాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోగల ప్రయత్నాలు చేస్తున్నాయి. కనీస మానవ సంస్కృతి కూడా, పాత తిరోగమన అజ్ఞాన జీవితం మీద ఆధారపడి ఏర్పాటు చెయ్యడం జరగదని తెలుసుకున్నారు. ఇక్కడి పని, పరిశ్రమల్లో కంటే కష్టమయింది. మన స్థానిక శాఖలలోనూ సోవియట్లలోనూ ఎక్కువ తప్పులు కూడా జరుగుతున్నాయి. కాని, వాళ్ళు తమ తప్పుల నుంచి నేర్చుకుంటారు. సామాన్య జనం వల్ల పొరపాట్లు జరిగితే వాటికి మనం భయపడం. వాళ్ళు సోషలిస్టు నిర్మాణానికి అంతశ్శుద్ధి గల దృక్పథంతో వుంటారు. ఎందుకంటే మనం మన ప్రజల అనుభవం మీదా, ప్రయత్నాల మీదా, విశ్వాసం వుంచుతాం.

పల్లె ప్రాంతాల్లో ఇంత తక్కువ వ్యవధిలో వచ్చిన ఈ అద్భుతమైన నవచైతన్యం మనల్ని సోషలిజం వైపు నడిపించడం, మన పోరాటం విజయవంతమయిందని తెలియజేస్తోంది. ఎర్రసైన్యమే దానికి కొట్టవచ్చినట్లు కనిపించే దాఖలా. రష్యాలో సామాన్య ప్రజాజీవితాన్ని దుర్భరం చేసిన సామ్రాజ్యవాద యుద్ధంనాటి రోజులు మీకు తెలుసు. ఆ రోజులలో పరమ నిస్సహాయస్థితిలో మనం వున్నామనీ మనకు తెలుసు. ఆ సత్యాన్ని శ్రామిక ప్రజలకి నిర్మొహమాటంగా మనం చెప్పాం. మోసగించడానికి పనికొచ్చే సామ్రాజ్యవాదుల రహస్య ఒప్పందాలని మనం బట్టబయలు చేశాం. అవి మోసగించడానికి పనికొచ్చే బ్రహ్మాండ సాధనమైన సిద్ధాంతం తాలూకు ఫలితాలు. బూర్జువా సామ్రాజ్యవాద ప్రజాస్వామిక రిపబ్లిక్‌లలో ఎంతో అభివృద్ధి చెందిన అమెరికా, యివాళ ఎప్పటికంటే ఎక్కువగా ప్రజల్ని మోసగిస్తోంది. ఇష్టం వచ్చినట్లు ఆడిస్తోంది. యుద్ధం యొక్క సామ్రాజ్యవాద తత్వం స్పష్టమవగానే రష్యన్ సోవియట్ రిపబ్లిక్ ఒక్కటే బూర్జువా రహస్య విదేశాంగ సిద్ధాంతాన్ని తునాతునకలు చేసిన దేశం. మనం ఆ రహస్య ఒప్పందాన్ని బట్టబయలు చేసి కామ్రేడ్ ట్రాట్స్కీ ద్వారా ప్రపంచంలోని అన్ని దేశాలకీ చాటాం. 'ఈ యుద్ధాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో ఆపుచెయ్యాల్సిందిగా మీకు విజ్ఞప్తి చేస్తున్నాం', దురాక్రమణలూ, పత్రాలూ లేకుండా. బూర్జువా ప్రభుత్వాలమీద విప్లవం మాత్రమే ఈ యుద్ధాన్ని అంతమొందిస్తుంది' అని నిర్మొహమాటంగా, గర్వంగా సత్యాన్ని – కటువయిన సత్యమే అయినప్పటికీ సత్యమేకదా – ప్రకటిస్తున్నాం. కాని మనం ఏకాకిగా నుంచుండిపోయాం. అంచేత బ్రెస్టలితోవ్స్కీ సంధిద్వారా మనపై రుద్దబడిన దుర్భర వేదనాభరితమైన శాంతితో దాని మూల్యం చెల్లించాం. ఆ సంధి మన సానుభూతి పరుల్ని నిరాశలోనూ, నిస్పృహలోను ముంచింది. మనం ఏకాకిగా వుండిపోవడం వల్లనే అలా జరిగింది. కాని మనం మన పనిచేశాం. యుద్ధలక్ష్యాలని ప్రతివాళ్ళూ చూడ్డానికి ఎత్తిపట్టాం. జర్మన్ సామ్రాజ్యవాద దాడి మనల్ని చుట్టుముట్టింది. ఎందుకంటే మన శ్రామికులు, రైతులు సరిగా నిర్మాణమవడానికి, సంఘటితమవ్వడానికి కొంత వ్యవధి పట్టింది కనుక. అప్పట్లో మనకి సైన్యం లేదు. మనకున్నదల్లా, పాత చీలిపోయిన సామ్రాజ్యవాద సైన్యం. తాము బలపరచని గమ్యం వున్న ఆ యుద్ధంలోకి, వాళ్ళు తరమబడ్డారు. ఆ యుద్ధం అంటే సైనికులకి సానుభూతిలేదు. అంచేత మనం బాధాకరమైన సమయం గడపాల్సి వచ్చింది. ఘోరమైన సామ్రాజ్యవాద యుద్ధం నుంచి ప్రజలకి ఊపిరి పీల్చుకొనే వ్యవధి కావాల్సిన సమయం అది. ఇంకో కొత్త యుద్ధం ఆరంభమవుతోందని గుర్తించాల్సిన సమయం అది. మన సోషలిస్టు విప్లవాన్ని రక్షించుకోడానికి చేసే యుద్ధాన్ని మన యుద్ధంగా మనం పరిగణించగలం. తమ అనుభవాలనుంచే లక్షలాది ప్రజలు గుర్తించి నేర్చుకున్నది అది. దానికి నెలలు పట్టింది. ఈ గుర్తింపు రావడానికి దీర్ఘమయిన కఠోరమైన యుద్ధం పట్టింది. ఈ వేసవికి ఆ గుర్తింపు వచ్చింది. ఆ విషయం అందరూ గమనించారు. ఆఖరికి బయటపడ్డం జరిగింది. సోవియట్ రిపబ్లిక్ కోసం పోరాడే సైన్యం, ప్రజల నుంచి వచ్చే సైన్యం, తనకితానే పోరాటానికి అర్పితమయ్యే సైన్యం, నాలుగేళ్ళ క్రూరమైన వధల తర్వాత మళ్ళీ యుద్ధంలోకి వెళ్ళగలిగే సైన్యం వుండాలంటే, తమ అలసత్వాన్ని, నిస్పృహని అవతలకు నెట్టి ఆ సైన్యం తమ కోసమే సోవియట్ శ్రామిక, కర్షకుల కోసం, సోషలిస్టు రిపబ్లిక్ కోసం చనిపోవడానికి తలపడుతున్నారనే గుర్తింపు ప్రజలకి రావాలి. ఆ గుర్తింపు సాధించాం.

వేసవిలో చెకొ (ప్రతీఘాతుక విప్లవంపై) మీద మనం సాధించిన విజయం ఒక మలుపు తిరిగేదశకి చేరుకున్నట్టు ఇప్పుడు అందుతూవున్న బృహత్తర విజయవార్తలు తెలియజేస్తాయి. కష్టతరమైన కర్తవ్యం – నాలుగేళ్ళ ఘోరయుద్ధం తర్వాత ప్రజల్ని రాజకీయంగా చైతన్యవంతమైన సామ్యవాద పంథాలో నడిపించడమనేది – సాధించబడిందని ఋజువయింది. ఆ రాజకీయ చైతన్యం ప్రజలలో చాలా దూరం చొచ్చుకుపోయింది. లక్షలాది ప్రజలు తాము ఒక కష్టమైన పనిని పరిష్కరిస్తున్నామనే గుర్తింపుకు వచ్చారు. అది మనం నిస్పృహకు గురికాబోమనే హామీని యిస్తుంది. ప్రపంచ సామ్రాజ్యవాద శక్తులు ఈ రోజున మనకంటే బలీయంగా వున్నా, మనకు వ్యతిరేకంగా కూడగట్టబడుతున్నా, సామ్రాజ్యవాద సైనికులు మనల్ని చుట్టుముట్టి వున్నా, వాళ్ళకి తెలుసు సోవియట్

ప్రభుత్వం ప్రమాదమని. అంచేత, వాళ్లు మనకంటే బలవంతులని మనం నిజంగా చెపుతూవున్నా, మన ప్రభుత్వాన్ని పీకనులిమేయాలనే ఆత్రుతతో వున్నారు.

మనం అభివృద్ధి చెందుతూవున్నామని మనం అంటున్నాము. సోవియట్ రిపబ్లిక్ అభివృద్ధి చెందుతోంది. సామ్రాజ్యవాద శక్తులు మనమీదకు ముంచుకొచ్చేకంటే వేగంగా శ్రామిక విప్లవం పెరుగుతోంది. మనం ప్రపంచ సోషలిస్టు విప్లవం కోసం, రష్యన్ సోషలిస్టు విప్లవంతో పాటుగా, పోరాడుతున్నామనే పూర్తి ధైర్యంతో, ఆశతో వున్నాం. ఈ విజయాన్ని గురించిన మన ఆశలు త్వరగా పెరుగుతూ వున్నాయి. ఎందుకంటే మన శ్రామికులు ఎక్కువగా రాజకీయ చైతన్యవంతులవుతున్నారు కనుక. గత అక్టోబరులో, సోవియట్ వ్యవస్థ స్థితి ఎలా వుంది? ఆరంభ ప్రయత్నాలు మాత్రం జరుగుతూ వున్నాయి. దాన్ని పరిపుష్టం చేయలేకపోయాం, సరిఅయిన దారిలోనూ పెట్టలేకపోయాం. కానీ ఈనాడు మనకి సోవియట్ రాజ్యాంగం వుంది. జులైలో ఆమోదించబడ్డ సోవియట్ రాజ్యాంగం, మనకి తెలిసినట్లుగా ఏ రాజ్యాంగ పరిషత్ కల్పనాకాదు, ఏ న్యాయవాదుల సృష్టికాదు. మిగతా రాజ్యాంగాల నుంచి ఎత్తి రాసుకున్నదీకాదు. మన రాజ్యాంగం లాంటిదాన్ని ప్రపంచం ఎన్నడూ ఎరగదు. ఇంటాబయటా కూడా వున్న పీడకులకి వ్యతిరేకంగా పోరాటంలోనూ, నిర్మాణంలోనూ, శ్రామికులకి కలిగిన అనుభవాన్ని ఇది యిముడ్చుకొంది. మనకి పోరాట అనుభవ సంపద వుంది. (కరతాళధ్వనులు) ఈ అనుభవ సంపద ఒక వాస్తవానికి ప్రత్యక్షమైన బలం చేకూరుస్తోంది. అది సంఘటిత శ్రామికులు, పౌర అధికారులులేని, హాజరుగా వుండే సైన్యంలేని, యే ప్రత్యేక హక్కులూలేని (ఆచరణలో బూర్జువాలకే హక్కులు) సోవియట్ ప్రభుత్వాన్ని సృష్టించారు అనేది. కర్మాగారాల్లో కొత్తపద్ధతికి పునాదులు వేశారు. మనం కార్యాచరణకి తయారవుతున్నాం. సోవియట్ రాజ్యాంగం, ఆచరణలో శక్తివంతమైన రాజ్యాంగం కావాలని ముఖ్యమైన సహాయకులని తీసుకుంటున్నాం. కొత్తగా చేర్చుకున్న యువ రైతులున్నారు. వాళ్ళని కార్యాచరణకి తీసుకురావాలి. మన కర్తవ్యం నిర్వహించేందుకు వాళ్ళు సాయంరావాలి.

ఆఖరిగా నేను ప్రస్తావించదలుచుకున్నది అంతర్జాతీయ పరిస్థితి. మనం అంతర్జాతీయ కామ్రేడ్స్‌తో భుజం భుజం కలిపివున్నాం. రష్యన్ శ్రామిక విప్లవం తమతో ప్రపంచ విప్లవానికి నడుస్తుందన్న వుత్సాహమూ. దృఢసంకల్పమూ వాళ్ళ విశ్వాసంలో వున్నట్లు మనం చూశాం.

విప్లవానికి వున్న అంతర్జాతీయ ప్రాముఖ్యం పెరిగేకొద్దీ, సర్వ ప్రపంచంలోని సామ్రాజ్యవాదులూ మనపట్ల ఆగ్రహంతో యింకా చేరికైపోయారు. 1917 అక్టోబరులో, మన రిపబ్లిక్‌ని ఏదో వొక వింతగానూ, పెద్ద పట్టించుకోనక్కరలేనిదిగానూ చూశారు వాళ్ళు. కాని, రిపబ్లిక్ సైన్యం పెరిగింది. శక్తి సంపాదించుకొంది. కష్టమనిపించే సోషలిస్టు ఎర్రసైన్య నిర్మాణం సాధించ బడింది. మన లక్ష్యం శక్తిని పుంజుకొని, అధిక విజయాలు సాధించగానే అన్ని దేశాల్లోకి సామ్రాజ్యవాదుల వ్యతిరేకత, ద్వేషం, మరింత ఆగ్రహంగా మారి పెరిగిపోయాయి. తాము విల్ హెల్మ్ శత్రువులమని ప్రకటించుకున్న బ్రిటిష్, ఫ్రెంచ్ పెట్టుబడిదార్లు యిపుడు అదే విల్‌హెల్మ్‌తో కలసి సోషలిస్టు సోవియట్ రిపబ్లిక్ పీక నులిమెయ్యాలనే ప్రయత్నం చేసేదాకా వచ్చింది. ఎందుకంటే వాళ్ళకి తెలిసింది – యిది ఒక వింతకాదు. సోషలిజమ్‌తో ప్రయోగమూ కాదు అని; ఇది మూలకందమనీ ప్రపంచ సోషలిస్టు విప్లవానికి సిసలైన సారభూమి అని. దాంతోటి మన విజయంతో బాటుగా మన శత్రువులూ పెరిగారు. పరిస్థితిలోని తీవ్రతని ఏవిధంగానూ కప్పిపుచ్చకుండా, మనకి యేం జరగనుందో మనం గుర్తించాలి. మనం ఈ పరిస్థితిని ఎదుర్కోడానికి ఒంటరిగా వెళ్ళాం. వియన్నా, బెర్లిన్ శ్రామికులతోటి యిదే పోరాటంవైపు నడుస్తూవున్న వాళ్ళతోటి మన ఉమ్మడి లక్ష్యంకోసం, బహుశా ఎక్కువ వర్గచైతన్యం ఎక్కువ క్రమశిక్షణతో, మనతో వచ్చేవాళ్ళతోటి, కలిసే వుంటాం.

రష్యాకి వ్యతిరేకంగా మోహరించడానికి జర్మనీలో ఒక శ్వేత సైన్యం తయారుచెయ్యాలని మంతనాలు చేస్తున్నారు. మనం పూర్తిగా ఈ ప్రమాదాన్ని గుర్తించాం. అందుకనే దాపరికం లేకుండా అంటాం. అయ్యా, మేము సంవత్సరకాలం ఒక్కినే పనిచెయ్యలేదని. మనం పునాదులు వేశాం. నిర్ణయాత్మక యుద్ధాలకి తయారైవున్నాం. అవి నిజంగా నిర్ణయాత్మక యుద్ధాలే కాని మనం ఒంటరిగా లేం; పశ్చిమ యూరప్‌లోని శ్రామికవర్గం రంగంలోకి దిగింది. ఆస్ట్రియా, హంగేరీలలో దేన్నీ కదల్చకుండా వుండలేదు. ఆ దేశ ప్రభుత్వం 1917 ఫిబ్రవరి ఆఖరులో నికలస్ రొమనోవ్ ప్రభుత్వం లాగ తలచెడి అంత నిస్సహాయంగా అంత గందరగోళంగా వుండిపోయింది. మన నినాదం ఎలా వుండాలి అంటే : మరొక్కసారి ప్రతి శ్రమని పోరాటంలోకి పెట్టండి; మన కడసారి పోరాటానికి, నిర్ణయాత్మక పోరాటానికి ఒక్క రష్యన్ విప్లవానికే కాకుండా మొత్తం ప్రపంచ సోషలిస్టు విప్లవం కోసం, సన్నద్ధులమవుతున్నామనీ గుర్తుకు తెచ్చుకోండి.

సామ్రాజ్యవాద రాబందులు మనకంటే బలమైనవని మనకి తెలుసు. వాళ్ళంతా మన దేశం మీద ఘోరాల్ని దుర్మార్గాల్ని సర్వ విధ్వంసాన్ని రుద్దగలరని మనకి తెలుసు. కాని ప్రపంచ విప్లవాన్ని ఓడించలేరు. వాళ్ళు అనాగరిక కక్షతో వున్నారు. అంచేత ఏం వచ్చినాసరే ప్రతి రష్యన్ శ్రామికుడూ, కర్షకుడూ తన కర్తవ్యం నెరవేర్చాలని విప్లవ పరిరక్షణకోసం అవసరంపడితే మృత్యువునైనా ఎదిరించాలని అనుకుందాం. సామ్రాజ్యవాదులు ఎన్ని కష్టాలు మనమీద మోపినా పరవాలేదు, అవి వాళ్ళని కాపాడవు. సామ్రాజ్యవాదం నశిస్తుంది. ఎన్ని అవాంతరాలున్నా ప్రపంచ సోషలిస్టు విప్లవం విజయం సాధిస్తుంది. (కరతాళ ధ్వనులమోత దీర్ఘ హర్షధ్వానాలుగా మారుతూ.)

**కూర్చిన రచనలు, వాల్యూం 28, పేజీలు 135–150**

ooooo